క్లుప్తంగా

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం



తెనాలిఅర్బన్: మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్‌లో 950కిపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో మాస్టర్ మైండ్స్ అధినేత మట్టుపల్లి మోహన్, వివిధ కళాశాలల డైరెక్టర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో నాలుగు బంగారు పతకాలు



తెనాలిఅర్బన్: ఇండియా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్ షిప్‌లో తెనాలి కేఎస్ఆర్ తైక్వాండో అకాడమి విద్యార్థులకు నాలుగు బంగారు, నాలుగు వెండి, ఐదు కాంస్య పతకాలు లభించాయని కోచ్ కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. వీటిని విశాఖపట్నంలో ఈ నెల రెండు నుంచి నాలుగు వరకు నిర్వహించినట్లు చెప్పారు. పథకాలు సాధించిన విద్యార్థులను ఆదివారం అకాడమీలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్ కుర్రా సుజాత, సీనియర్ కోచ్ పొలయ్య అభినందించారు.

ఏఆర్‌టీ సెంటర్‌లో పౌష్టికాహారం పంపిణీ



తెనాలిఅర్బన్: తెనాలి ఏఆర్‌టీ సెంటర్‌లో మందులు తీసుకుంటున్న చిన్నారులకు ఆదివారం యుఈఎస్ఐ-ఏపీ తెనాలి ఈజీఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాలలోని పీపీయూనిట్ వైద్యులు డాక్టర్ రమాదేవి, పీపీయూనిట్ సూపర్‌వైజర్ రవికుమార్, ఈజీఎస్ కమిటీ సభ్యులు టి.ప్రియదర్శిని, మార్క్, హృదయ రాజు, డాక్టర్ సుందర్, డాక్టర్ అప్పారావు, మాలతీ, ఝాన్సీ, శ్రీరామ్, రత్న, రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని మంచికలపూడిలో మృతి చెందిన వృద్ధుని అంత్యక్రియలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అందించిన రూ.10వేల ఆర్థిక సాయాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు(చిన్నా), దాసరి వీరయ్య, ఆత్మకూరి నాగేశ్వరరావు, పులి బాలస్వామి, కుక్కమళ్ల జనార్ధనరావు, అద్దేపల్లి జయరాజు, చలపాటి చిట్టియ్య పాల్గొన్నారు.
దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరులో ప్రమాదవశాత్తు మృతి చెందిన బాలుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్కే సహకారంతో ఆదివారం రూ.20వేల ఆర్థిక సహాయాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ అందించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, గ్రామ సర్పంచి ఉన్నం ఝాన్సీ, ఉప సర్పంచి ఎం. నాగలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు షేక్ సుభాని, వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి వీరయ్య, గుమ్మడి తంబిరాజు, దూళ్లవీర వసంతరావు, గుడిపూడి శేషయ్య పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై సుదర్శన హోమం



తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఆదివారం సర్వరక్షాకర సుదర్శన హోమాన్ని నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ జ్యేష్ఠ అమావాస్యను పురస్కరించుకుని లోక కల్యాణార్థం సర్వరక్షాకర సుదర్శన హోమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తాగునీటి ట్యాంకర్ల ఫిల్టర్ బెడ్ శుభ్రం

తాడేపల్లిరూరల్: వాటర్ ట్యాంక్‌లు, ఫిల్టర్ బెడ్‌ల క్లీనింగ్ కార్యక్రమం ఆదివారం చేపట్టారు. అన్ని శివారు ప్రాంతంలో వాటర్ పైపు లైన్లు వాల్వ్ తొలగించి పైపులైన్లు కూడా క్లీనింగ్ చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.

ఇంటింటికి ఫ్యామిలీ డాక్టర్

- గ్రామాల్లో విస్తృతంగా వైద్య సేవలు
- నెలలో రెండు సార్లు ఇంటి వద్దనే వైద్య పరీక్షలు
- హర్షం వ్యక్తం చేస్తున్న దీర్ఘకాలిక రోగులు




ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కొల్లిపర: ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొస్తున్నారు. ఇంటింటికి నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్న సంకల్పంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు.
దీని ద్వారా సచివాలయం పరిధిలోని ప్రజలకు నెలకు రెండు పర్యాయాలు వారి ఇళ్ల వద్దకే వైద్యులు వెళ్లి వైద్యం అందిస్తున్నారు. దీనివల్ల గ్రామాల్లో వైద్య సేవలు విస్తృతమవ్వడంతో పాటు దీర్ఘ కాలిక వ్యాధులతో బాధ పడుతున్న రోగులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

ఉచితంగా నెలకి సరిపడా మందులు పంపిణీ ...
ఫ్యామిలీ డాక్టర్స్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని ఇద్దరు డాక్టర్లు , ఏఎన్ఎం, డీఈఓ, ఎంఎల్‌హెచ్‌పి, ఆశ కార్యకర్త సహకారంతో వైద్య సేవలు అందిస్తున్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకూ ఓపీ సేవలుఅందిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ప్రమాదాలు, వివిధ అనారోగ్యకారణాలతో మంచాన పడిన రోగుల వద్దకు వెళ్లి చికిత్స చేస్తున్నారు. వీరికి నెలకి సరిపడా మందులను అందిస్తున్నారు. అంతేకాకుండా 14 రకాల రక్తపరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేస్తున్నారు. దీంతో పాటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక సేవలందిస్తున్నారు.

నాణ్యమైన వైద్యం అందుతుంది



నేను చాలా కాలంగా బీపీ తో బాధపడుతున్నాను. సచివాలయంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ క్యాంపునకు వెళ్లి రెగ్యూలర్‌గా వైద్య సేవలు పొందుతున్నాను. డాక్టర్లు ఎంతో ఓపికగా పరీక్షలు చేసి మందులిస్తున్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్యం ఇంటి వద్దనే అందుతుంది.
– బొట్టా ప్రసాద్ రెడ్డి, వల్లభాపురం, కొల్లిపర మండలం

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



నాకు 35 ఏళ్ల బీపీ, షుగరుతో గత రెండు సంవత్సరాల నుంచి బాధపడుతున్నాను. మా కుటుంబంలో మేము రోజు కూలీ పనికివెళ్తేగాని కుటుంబం గడవదు. దీనికి తోడు బీపీ, షుగర్ రావడంతో కూలీకి వెళ్లిన డబ్బులు మొత్తం రోగానికి సరిపోయేవి కావు ఇటువంటి క్రమంలో ప్రభుత్వం తీసుకున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం వల్ల వైద్యులు , 104 వాహనం ఇంటి వద్దకే వచ్చి పరీక్షలు నిర్వహించి ఫ్రీగా నెలకి సరిపడా మందులిస్తున్నారు. మాలాంటి పేద వారికి ఎంతో మేలు చేస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.
– లంకే రాజ్యలక్ష్మి , వల్లభాపురం, కొల్లిపర మండలం

మహాప్రస్థానానికి రూ.1.75 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

తెనాలి: పట్టణ పాండురంగపేటలోని మహాప్రస్థానంలో నూతనంగా నిర్మిస్తున్న గ్యాస్ చాంబర్‌కు అవసరమైన షెడ్డు నిర్మాణానికి శనివారం ఇద్దరు దాతలు రూ.1.75 లక్షలను విరాళంగా ఇచ్చారు. పరుచూరి సుధాకర్‌రావు రూ.లక్ష, పాట్లూరి శివసుబ్రహ్మణ్యం రూ.75 వేల చొప్పున విరాళాలను మహాప్రస్థాన సేవాసమితి అధ్యక్షుడు ఢాకా సాంబిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జెట్టి శివరామకృష్ణప్రసాద్‌కు అందజేశారు. గతంలో చెప్పినట్టుగానే గ్యాస్ ఆధారిత చాంబర్‌ను, మార్చురీ రూమ్ నిర్మాణాలను అతి త్వరలోనే పూర్తిచేస్తామని శివరామకృష్ణప్రసాద్ వెల్లడించారు. సాధ్యమైనంతవరకు జులై నెలలో అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. వీరితో తుమ్మల బాపయ్యచౌదరి, చదలవాడ శంకరప్రసాద్, రావూరి శివశంకరరావు ఉన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



తెనాలిరూరల్: ఆటో డ్రైవర్లు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని పలు గ్రామాల వద్ద ఆదివారం సాయంత్రం ఆయన ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రైవర్లందరూ ఖచ్చితంగా లైసెన్సు కలిగి ఉండాలని, యూనిఫాం ధరించి ఉండాలన్నారు. లైసెన్సు లేకుండ ఆటో నడిపి ప్రమాదాలకు గురైతే బాధితులకూ ఇన్సూరెన్స్ సంబంధిత న్యాయం జరగదని చెప్పారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని అవసరమైతే ప్రాంతీయ రవాణా అధికారి వద్ద హాజరుపరచి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. 17 ఆటోలు తనిఖీ చేయగా ఒక్క డ్రైవరూ యూనిఫాం ధరించలేదని, వారికి అపరాధ రుసుం విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేయాలి

బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్



బహిరంగ సభలో మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శి సత్యకుమార్

తెనాలిటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని బీజేపీ నాయకులు, కార్యకర్తలను ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ కోరారు. భారతదేశానికి ప్రపంచ వ్యాప్తంగా నరేంద్రమోడీ గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఆదివారం మార్కెట్ సెంటర్‌లో జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహించారు. సభకు పార్టీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ అధ్యక్షత వహించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తొమ్మిదేళ్ళ పరిపాలనలో సాధించిన విజయాలు, సేవ, సంక్షేమం తదితర అంశాలపై నాయకులు ప్రజలకు వివరించారు. సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సత్యకుమార్ మాట్లాడుతూ రాజకీయ నాయకులకు, కవులకు, సినీనటులకు పెరుగాంచి ఆంధ్రాప్యారిస్‌గా వెలుగొద్దుతున్న తెనాలి పట్టణంలో బహిరంగ సభలో పాల్గొనడం ధర్మంగా ఉందన్నారు. తొమ్మిదేళ్ళుగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళల ఆత్మగౌరవం కోసం మరుగుదొడ్లను నిర్మిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో పసుపు, మిర్చి పంటలకు మద్దతు ధర పెంచి కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జోనల్ ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణు వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ అమరావతి రాజధానియే బీజెపి అజెండా అని పేర్కొన్నారు. బీజేపీ దానికి కట్టుబడి ఉందని తెలిపారు. 2004 నుంచి 2014వరకు కాంగ్రెస్ పార్టీ పాలనలో అవినీతి జరిగిందని ఆరోపించారు. కరోనా సమయంలో 240 కోట్ల వ్యాక్సిన్‌లను కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేసినట్లు చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి పాతూరి నాగభూషణం మాట్లాడుతూ అమరావతి ప్రాంత ప్రజలపై కక్ష కట్టి మూడు రాజధానులను ప్రవేశపెడుతున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి సత్యకుమార్, జోనల్ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణలను భారీ గజమాలతో నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో మహిళా మోర్చా కార్యదర్శి యామిని శర్మ, సీనియర్ నాయకురాలు యడ్లపాటి స్వరూపరాణి, పార్టీ నాయకులు టి.అనంతాచార్యులు, మంచాల రత్నరాజు, పూర్ణచంద్రరావు, యోగనంద కిషోర్, మైలా హరికృష్ణ, దొడ్డా జార్జీ, తోటకూర కోటేశ్వరరావు, అడుసుమల్లి సుధాకర్, బిట్రా కనకదుర్గ, టి.రఘు, కె.వాసుదేవనాయుడు, అన్నవరపు వేణు, విజయభాస్కర్‌రెడ్డి, యశ్వంత్, సైదారెడ్డి, అంబేడ్కర్, నాగేంద్ర యాదవ్, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాజీబాబా దర్గాలో అన్న సంతర్పణ



పెదకాకాని: బాజీబాబా దర్గాలో భక్తులకు ఆదివారం అన్న సంతర్పణ జరిగింది. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాకు అమావాస్య రోజున రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. దర్గా ప్రాంగణంలోనే నిద్రలు చేసే వారికి స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య సహకారంతో దర్గా ప్రాంగణంలో అన్నసంతర్పణ జరిగింది. బాజీబాబా దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషా భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెదకాకాని ఎస్ఐ పాదర్తి కోటేశ్వరరావు, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్‌హుస్సేన్, దర్గా సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం



సేవా కార్యాక్రమాల్లో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ సభ్యులు

పెదకాకాని: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ సేవలు అభినందనీయమని మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ పి.శివన్నారాయణ అన్నారు. గుంటూరు గీతా రీజెన్సీలో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ 2022–23 అవార్డ్స్ కార్యక్రమం జరిగింది. సమావేశం అనంతరం క్లబ్ సభ్యులు రవిలిశెట్టి వేణుగోపాలరావు, పద్మజ సహకారంతో దివ్యాంగ పండ్ల వ్యాపారికి తోపుడు బండిని అందజేశారు. వడ్లమల్లి సతీష్ బాబు, విజయలక్ష్మి అక్షర వృద్ధాశ్రమానికి టీవీని బహూకరించారు. కాలీగ్రఫీ బుక్స్‌కి శివన్నారాయణ, క్లబ్ డైరెక్టర్ పి.ఆదిశేషులు రూ.25 వేలు చెక్ ను ఉపాధ్యాయులకు అందజేశారు. క్లబ్ లో విశేష సేవలందించిన సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో క్లబ్ ప్రెసిడెంట్ విమలకుమారి, సెక్రటరీ పద్మజ, ట్రెజరర్ మమత, ట్రైనర్ వెంకటరమణ, డైరెక్టర్లు వైపీ చౌదరి, డాక్టర్ సుధాకర్, చావలి గణపతి, ప్రేమ్‌కుమార్, కృష్ణమోహన్, ఆదిశేషు, మద్ది రాధాకృష్ణ, పి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను శుభ్రపరిచిన ప్రణవపీఠం సేవకులు

పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు పట్టణంలోని సహస్రలింగేశ్వరస్వామి, వీరాంజనేయస్వామి దేవాలయాలను ఏలూరు ప్రణవ పీఠం సేవకులు ఆదివారం శుభ్రపరిచారు. పీఠం వ్యవస్థాపకులు వి.పద్మాకర్ సూచనల మేరకు సభ్యులు ఎన్.వంశీ, భాగ్యశ్రీ బృందం ఆలయాల శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రణవపీఠం సేవకులు మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఒక దేవాలయాన్ని తమ సేవకులు శుభ్రపరుస్తున్నట్లు తెలిపారు. ఏడాదిగా సుమారు 60కు పైగా దేవాలయాలను పరిశుభ్రపరిచినట్లు వెల్లడించారు.

హేతుబద్ధంగా ఆలోచించాలి



మాట్లాడుతున్న హనుమంతరావు

బాపట్ల: హేతుబద్ధంగా ఆలోచించి.. మానవత్వంతో జీవించాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు కె.హనుమంతరావు అన్నారు. హేతువాదనలు ప్రేరేపించడమే హేతువాద మనవాద ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. బాపట్లలోని ఎన్జీవో హోంలో హేతువాద సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. భారత హేతువాద సంఘ ట్రెజర్ షేక్ బాబు మత చాందస వాదం అనే అంశం మీద ప్రసంగిస్తూ మనుషులు స్వేచ్ఛగా, స్వతంత్రంగా, వివేకంతో జీవించే అవకాశం ఉండాలన్నారు. భారత హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ విశ్వతత్వం – పరిణామం అంశం మీద ప్రసంగించారు. విశ్రాంత అధ్యాపకులు కారు మంచి విజయ్ కుమార్, గోరంట్ల శాంతారాం, బాపట్ల హేతువాద సంఘ అధ్యక్షుడు కరణం రవీంద్రబాబు, హేతువాద సంఘ సహాయ కార్యదర్శి సింహాద్రి యలమందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం యువసేన ఆవిర్భావం



మంగళగిరి: నగరంలోని ముస్లిం మైనార్టీల కోసం పని చేసే అంజుమన్ సంస్థకు సంబంధించి పాలకవర్గ ఎన్నికలు త్వరలో జరుగనున్న నేపథ్యంలో ఆ సంస్థ మాజీ కార్యదర్శి ఇస్మాయిల్ నాయకత్వంలో ముస్లిం యువసేన పేరిట నూతన ప్యానల్ ఆవిర్భవించింది. ఈ మేరకు ఆదివారం గౌతమ బుద్ధారోడ్డులోని ఈద్గా ఫంక్షన్ హాల్‌లో ఆవిర్భావ సభ నిర్వహించారు. అనంతరం అంజుమన్ మాజీ కార్యదర్శి ఇస్మాయిల్ నాయకత్వంలో ఏర్పడిన నూతన ప్యానల్ ముస్లిం యువసేన పేరును ప్రకటించి జెండాను షేక్ జలీల్ ఆవిష్కరించారు. జిలానీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అంజుమన్ మాజీ కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్, మాజీ కౌన్సిలర్ ముహమ్మద్ చిన ఖాసిం, అంజుమన్ మాజీ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాబు, పాలకవర్గ డైరెక్టర్‌లు షేక్ అక్బర్ అలీ, పఠాన్ బుజ్జి, షేక్ అక్రమ్, ఖాదర్‌బాబు పాల్గొన్నారు.

25న తెనాలిలో ఈ-శ్రమ్ గుర్తింపు కార్డుల జారీ

జిల్లా కార్మికశాఖ ఉప కమిషనర్ ధూళిపూడి వెంకట శివప్రసాద్



మాట్లాడుతున్న ధూళిపూడి వెంకట శివప్రసాద్

తెనాలి: దేశంలోని అసంఘటిత కార్మికులతోపాటు సినిమా పరిశ్రమలోని 24 విభాగాల కార్మికులకు కూడా భారత ప్రభుత్వం సామాజిక భద్రత కల్పిస్తుందని గుంటూరు జిల్లా కార్మికశాఖ ఉప కమిషనర్ ధూళిపూడి వెంకట శివప్రసాద్ అన్నారు. తెనాలిలోని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ (మా-ఏపీ) కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మా-ఏపీ సహకారంతో ఈనెల 25న తెనాలి సుల్తానాబాద్‌లోని రత్న ఫార్చ్యూన్ కళ్యాణమండపంలో ఉదయం 9 గంటల్నుంచి అర్హులకు ఈ-శ్రమ్ కార్డులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. 16–59 సంవత్సరాల వయసుల్కలు, పీఎఫ్ లేని అసంఘటిత కార్మికులంతా అర్హులేనని చెప్పారు. ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ జిరాక్స్, రెండు పాస్‌పోర్టు ఫొటోలతో ఆరోజు రావాలని, 12 అంకెల యూనివర్సల్ అకౌంట్ నంబరు గల గుర్తింపు కార్డులను జారీచేస్తామని శివప్రసాద్ తెలిపారు. వీరి ఆధార్‌కార్డుకు ఫోన్ నంబరు లింకయి ఉండాలన్నారు. ఒకే ఇంట్లో ఉండే నలుగురు కూడా అర్హులేనని చెప్పారు. అలాగే ప్రధానమంత్రి శ్రమ యోజన్ మాంధన్ పేరుతో 18–40 వయస్కులకు పెన్షన్ స్కీము అమల్లో ఉందన్నారు. ఇందులో చేరే సభ్యులు వయసు ప్రకారం నెలకు రూ.50 నుంచి రూ.200 వరకు చెల్లించాల్సి ఉంటుంది. వీరికి మరణించే వరకు ప్రభుత్వం పింఛను ఇస్తుందని వివరించారు. మా–ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా మాట్లాడతూ అసోసియేషన్‌లోని కార్మికులే కాకుండా రిక్షా కార్మికులు, బీడీ కార్మికులు, విస్తరాకుల తయారీదారులు, ఇటుకరాళ్ల కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, తోపుడుబండి వ్యాపారులు సైతం ఈ-శ్రమ్ గుర్తింపు కార్డులను పొందవచ్చని వివరించారు. అసోసియేషన్ సభ్యులు ఆలియా, ధనలక్ష్మి, మిలటరీ ప్రసాద్, అమీర్‌చౌదరి, అరుణకుమారి, రఫీ, శ్యామ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెరుమాళ్లస్వామి కల్యాణం



పూజల్లో పాల్గొన్న ఎస్వీయోగ కన్వీనర్ రమణయ్య దంపతులు

తెనాలిటౌన్: బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన ఆవరణలోని శ్రీ సాలీగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత సుందర శ్రీనివాసా పెరుమళ్ళస్వామివారి కల్యాణ మహోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. పూజ్యశ్రీ బాలస్వామిజీ స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల క్షేత్రంలో జరిగే విధంగా వేద పండితుల ఆధ్వర్యంలో భక్తుల స్వహస్తాలతో అభిషేకాలు, పూజలు చేయించారు. ప్రముఖ ఆధ్యాత్మిక టీవి ప్రవచకులు, హనుమాన్ ఉపాసకులు డాక్టర్ చిదంబర శాస్త్రి తిరుమల క్షేత్ర వైభవం, విశిష్టతను భక్తులకు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మఠం ట్రస్ట్ చైర్మన్ నంబూరు కృష్ణమూర్తి దంపతులు ఉప్పల నాగేశ్వరరావు, గుడివాడ శివప్రసాద్, ఎం.రమణయ్య, రావూరి సుబ్బారావు, గోపు రామకృష్ణ, చుండూరు లోకనాథం, శ్రీ విద్యాపీటం సభ్యులు గడ్డిపాటి ఉమాదేవి, భక్తులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థినులకు ఉపకార వేతనాలు

తెనాలి: పట్టణ, పరిసరాల్లోని కాలేజీల్లో చదువుకునే ఆర్యవైశ్య విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలను స్థానిక గంగానమ్మపేటలోని శ్రీకన్యకాపరమేశ్వరి వైశ్యవిద్యానిధి కమిటీ హాస్టలులో కల్పిస్తామని సంస్థ కార్యదర్శి పెండేల వెంకట్రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇంటర్ నుంచి పీజీ, ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు ఉచిత వసతి కోసం దరఖాస్తులు కమిటీ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. అవసరమైన ఆర్యవైశ్య విద్యార్థులు ఉదయం 10 గంటల్నుంచి సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను తీసుకుని పూరించి అందజేయాలని కోరారు. ముందుగా వచ్చిన దరఖాస్తుల్లో అర్హులైన 100 మంది విద్యార్థులను హాస్టలులో ప్రవేశం కల్పిస్తామని వివరించారు. ఇతర వివరాలకు : 94402 58574 నంబరును సంప్రదించవచ్చని సూచించారు.

ఆర్యవైశ్య విద్యార్థినులకు ఉపకారవేతనాలు...
2022–23 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో 925 మార్కులుపైన, డిగ్రీ కోర్సుల్లో 80 శాతం పైగా మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఉపకార వేతనం ఇవ్వనున్నట్టు పెండేల వెంకట్రావు తెలియజేశారు. అర్హత కలిగిన ఆర్యవైశ్య విద్యార్థినులు సంబంధిత మార్కుల జాబితా జిరాక్స్, ఆధార్ కార్డుతో సహా ఈనెల 30వ తేదీలోగా సంస్థ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రెండు ఎకరాల గడ్డి వామి దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక అధికారులు

మంటల్లో కాలిపోయిన ట్రాక్టర్



కాలిపోయిన వరిగడ్డి వామి

బాపట్లటౌన్: విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఎకరాల గడ్డి వామి దగ్ధమైన ఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. చీరాల మండలం, పాత చీరాలకు చెందిన కుక్కల పోతురాజురెడ్డి బాపట్ల మండలం, చెరువుజమ్ములపాలెంలో రెండు ఎకరాల గడ్డిని కొనుగోలు చేసి పాత చీరాలకు చెందిన పుట్టా శివకృష్ణారెడ్డి ట్రాక్టర్‌లో తీసుకెళ్తుండగా.. జమ్ములపాలెం ఫ్లై ఓవర్‌బ్రిడ్జి సమీపంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. గడ్డితోపాటు, ట్రాక్టర్ ట్రక్కు దగ్ధమైంది. రూ. 1.50 లక్షల మేరా నష్టం వాటిల్లింది. వెంటనే స్థానికులు గమనించి అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించడంతో, వెంటనే సిబ్బంది స్పందించి మంటలను అదుపుచేశారు.

5 ఎకరాల వరిగడ్డి దగ్ధం
కొల్లూరు: వరిగడ్డి వాము దగ్ధమైన ఘటన చిన పులివర్రుల్లో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిన పులివర్రుకు చెందిన దొప్పలపూడి కోటేశ్వరరావు ప్రధాన రహదారి వెంబడి ఉన్న తన పొలంలో వరిగడ్డి వామి వేశాడు. మధ్యాహ్నం గడ్డివామి నుంచి మంటలు రావడం గమనించి, ఆర్పేందుకు ప్రయత్నాలు చేశారు. అప్పటికే మంటలు అధికమవడంతో గడ్డివామి అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. గుర్తుతెలియని నిప్పుపెట్టి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అగ్గికి అహుతైన వరిగడ్డి సుమారు రూ.60వేలు ఉండొచ్చు అని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజీవ్ శ్యామ్యూల్ కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎంత చెప్పినా 'వ్యర్థ'మే..!



భట్టిప్రోలు: భట్టిప్రోలు–బాపట్ల–వెల్లటూరు రహదారి వెంబడి వేస్తున్న వ్యర్థాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. ముఖ్యంగా కోళ్ల వ్యర్థాలను చికెన్ దుకాణ యజమానులు ఇక్కడికి తీసుకొచ్చి పడేస్తున్నారు. ఇవి కుళ్ళిపోయి భరించలేని దుర్వాసన వస్తుండటంతో.. వాహన ఛోదకులు ముక్కుమూసుకుని వెళ్తున్నారు. ఈ సమస్యపై పలువురు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు వ్యర్థాలు వేయకూడదని ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ పట్టించుకున్న వారు లేదరు. రోడ్ల వెంబడి వ్యర్థాలు వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com